# బ్రోకర్‌కు హఠావో.. బీఆర్ఎస్‌కు జితావో



బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాందాస్‌కు గులాబీ కండువా కప్పుతున్న పోచారం

- బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా ఆశీర్వదించండి
- సిద్దాపూర్ రిజర్వాయర్ పూర్తి చేసి భూములను సస్యశ్యామలం చేస్తా.
- వలస నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పండి
- మంచోడికి ఓటు వేయండి.. ముంచెటోడికి కాదు..
- ఎన్నిల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, నవంబర్ 26 : బాన్సువాడ నియో జకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి ప్రజలు 36 వేల పైచిలుకు ఓట్లతో ఓడించారని, అక్కడ చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందని బాన్సువాడ నియో జకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్, కాద్లాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా దళితుల భూములను ఆక్రమించుకొన్నాడని, ఆయనపై తిరగబడితే పోలీస్ స్టేషన్‌లో కొట్టించిన నాయకుడు ఏనుగు రవీందర్‌రెడ్డి అని విమర్శించారు. అలాంటి వ్యక్తిని నియోజకవర్గ ప్రజలు ఓటు హక్కుతో వంద మీటర్ల లోతులో బొందపెట్టాలని అన్నారు. బ్రోకర్‌కు హఠావో.. పోచారాన్ని జితావో అంటూ నినాదించారు. రైతును రాజుగా చేయడమే కేసీఆర్ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు సంక్షేమ పథకాలతో ఇక్కడి రైతులు పుష్కలంగా పంటలు పండిస్తుండడంతో దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదిగిందన్నారు. నియోజకర్గంలో 2,100 మంది గిరిజన రైతులకు 4వేల ఎకరాలకు పోడు పట్టాలు అందించామని అన్నారు.

**వలస నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పండి..**

బాన్సువాడ నియోజకవర్గ ప్రజలే నా కుటుంబమని, వారి సంక్షేమం కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నానని అన్నారు. తాను మరణిస్తే కట్టే కాలేది ఇక్కడేనని భావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు స్కీములు కావని, అవి వారు చేయనున్న స్కాములని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పోచారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేట్‌లో అన్ని కుల సంఘాలు పోచారానికి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని అందజేశారు. కాద్లాపూర్‌లో ఎన్నికల ప్రచారం అనంతరం రైతులు చేపట్టిన భారీ బైక్ ర్యాలీలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి సిద్దాపూర్ రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. రైతుబంధు సమి తి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, ఎంపీపీ, జడ్పీటీసీలు దొడ్ల నీరజా రెడ్డి, పద్మారెడ్డి, ఏఎంసీ చైన్మన్ నర్సింహులు, సర్పంచులు శ్రావణ్‌కుమార్, భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, హన్మాండ్లు, డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, గురు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

**భావి తరాల కోసమే సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం**

వర్ని, నవంబర్ 26 : భావి తరాల కోసమే సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ ఆయకట్టు ప్రాంత గ్రామాలైన సిద్దాపూర్, పైడిమల్, కోకల్‌దాస్ తండా, చింతల్ పేట్ తండా, హన్మాజి పేట్, జాకోర, జలాల్‌పూర్, సైద్‌పూర్ తదితర గ్రామాల్లో ఆదివారం భారీ ఎత్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. వచ్చే జూలై నాటికి నిర్మాణాన్ని పూర్తి చేసి సుమారు 25 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. హన్మాజిపేట్, సిద్దాపూర్ సర్పంచులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో ఎందుకు చేరారో చెప్పాలని అన్నారు. కేవలం కాంగ్రెస్ ఇచ్చే డబ్బు కోసమే పార్టీని వీడారని ఆరోపించారు. పార్టీని వీడిన వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించడంతో పాటు, మళ్లీ భూములు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బర్దావల్ హరిదాస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రంజ్యానాయక్, బీఆర్ఎస్ నాయకులు మేక వీర్రాజు, కల్లాలి గిరి, వెలగపూడి గోపాల్, కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

## ఆజ్ కీ తస్వీర్



## వారేవ్వా.. నీరా..

దేశాయిపేట్ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి గౌడ కులస్తులు నీరా కల్లు రుచిని చూపించారు. నీరా లొట్టిని పోచారానికి అందజేయగా, ప్రచారం రథంపై ఉన్న నాయకులకు పోయడంతోపాటు ఆయన తాగారు. తెలంగాణ ప్రాంతంలో గ్రామీణ ప్రాంత ప్రజల అమృతం నీరా అంటూ ప్రశంసించారు.

– బాన్సువాడ రూరల్, నవంబర్ 26

## బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబర్ 26 : నస్రుల్లాబాద్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు, బీజేవైఎం మాజీ అసెంబ్లీ కన్వీనర్ కూనింటి రాములు, వారి అనుచరులు 20 మంది యువకులు స్పీకర్ పోచారం స్వగృహం వద్ద బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్వచ్ఛందంగా బీఆర్ఎస్ పార్టీలోకి చేరడంతోపాటు సంపూర్ణ మద్దతు తెలిపిన వారికి డీసీసీబీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోచారాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- నాయకులు, కార్యకర్తల ఇంటింటి ప్రచారం

బాన్సువాడ/బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్, నస్రుల్లాబాద్/ వర్ని/రుద్రూర్/చందూర్, నవంబర్ 26 : బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాన్సువాడ పట్టణ, బాన్సువాడ రూరల్ మండలం, నస్రుల్లాబాద్, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా తదితర మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేస్తున్నారు. బాన్సువాడ పట్టణంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కోటగిరి మండలం యాద్గార్‌పూర్, ఎత్తొండ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాన్సువాడలో స్పీకర్ కోడలు సోనీరెడ్డి, ఎంఐఎం నాయకులు, మోస్రా మండలం చింతకుంటలో పోచారం తనయుడు పోచారం రవీందర్‌రెడ్డి గడప గడపకూ తిరుగుతూ పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



చింతకుంటలో పోచారానికి మద్దతుగా ప్రచారం చేస్తున్న పోచారం తనయుడు పోచారం రవీందర్‌రెడ్డి



యాద్గార్‌పూర్‌లో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పోచారం సురేందర్‌రెడ్డి



బాన్సువాడలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



బాన్సువాడ పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న పోచారం కోడలు సోనీ రెడ్డి